ఒకే ఒక్కడు...

ప్రభుత్వ భూములు కొల్లగొడుతున్నాడు..!

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఒక చోటా నాయకుడు ప్రస్తుతం ఒకే ఒక్కడు అవతారం ఎత్తాడు. ముందుగా చిన్న చిన్న పనులు చేసి విజయం సాధించడంతో నేడు ఏకంగా ఎకరాల కొద్ది ప్రభుత్వ, కాలువ భూములు కొల్లగొట్టి కోట్లాది రూపాయలకు పడగలెత్తి పెద్ద నాయకులను సైతం తలదన్నే విధంగా తయారవ్వడంతో పార్టీ నాయకులే ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంతకి ఎవరా నాయకుడు..? ఎవరా ఒకే ఒక్కడు.. చంద్రుడుపై మచ్చలా తయారై మొత్తం ప్రభుత్వం పోరంబోకు భూములు, గెడ్డలు, చెరువులు, కొండలు, పంచభూతాలను సైతం ఆక్రమించుకొని వాటిని అమ్ముకుంటూ సొమ్ములు చేసుకుంటున్నాడు. ఈ ఒక్కడుకు.. మరొక్కడు కలవడంతో ఇద్దరు రెచ్చిపోతున్నారు. తమకు నాయకుడి అండ దండలు ఉన్నాయని, ఎవరు ఏమి చేయలేరనే నేపంతో దోచుకుంటుండడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. నాలుగేళ్ల క్రితం ఈ చోటా నాయకుడు తెలుగుదేశంలో ఉండేవాడు. అక్కడ ఈయన ఆరాచకాలు భరించలేక వారు సాగనంపడంతో వైకాపాలో చేరాడు. అప్పటి నుంచి టీడీపీ నాయకత్వంపై దుమ్మెత్తుతు వైకాపా అగ్రనాయకుల దృష్టిలో పడ్డాడు. అదృష్టం వరించి వైకాపా అధికారంలోకి వచ్చింది. ఇక అంతే ఈ ఒకే ఒక్కడు తన దూకుడు పెంచుతూ ప్రజలకు సేవ చేయాల్సింది పోయి ప్రభుత్వ పోరంబోకు భూములు, చెరువులు, కాలువలు, కొండలను దోపిడీ చేయడం కొనసాగిస్తున్నాడు. ఇప్పటి వరకు అందిన వివరాల ప్రకారం 5 ఎకరాల ప్రభుత్వ భూమి దోపిడీ చేసి కోట్లాది రూపాయలు దండుకున్నట్లు ప్రచారం ఉంది. ఆయన కబ్జాలు, అమ్మకాలకు ప్రభుత్వ భూములు చిన్నబోతు న్నాయి. మొదటగా ఒకటో వార్డు మొగిలిపాడు జాతీయ రహదారి అనుకొని ఉన్న గ్రామ చెరువును చెర బట్టాడు. ఆ చెరువుకు ఆయకట్టు లేకపోవడంతో మొత్తం మట్టితో నింపి పట్టాలు సృష్టించి అడుగుల చొప్పున్న అమ్ముకున్నాడనే విమర్శలున్నాయి. ఈ వ్యవహారంలో ఆయనకు బాగా కలిసి రావడంతో మొత్తం చెరువునంతా తన బినామీ పేర్లుకు మార్చుకొని దాదాపుగా 10 ఎకరాల అమ్ముకున్నాడు. అధికారులకు తెలిసినా అధినాయకుడి అండదండలు ఉండడంతో కనీసం ప్రశ్నించలేని స్థితికి చేరుకున్నారు. దీనిపై అధికారులు నోటీసులు కూడా ఇవ్వకపోవడంతో వారి ఆగడాలకు అంతే లేకుండా పోయింది. సూదికొండ ప్రాంతంలో ఉన్న కంకర అమ్మకాలు చేసి మిగిలిన భూముల్లో పట్టాలు సృష్టించి అమ్ముకొని పబ్బం గడుపుకోవ డం విశేషం. అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లినా, భయభ్రాంతులు చేసి బదిలీ చేయించగలమని హెచ్చరికలు జారీ చేస్తుండ దంతో వారు మౌనం వహించాల్సి వస్తోంది. సూదికొండ, నెమలి కొండల మధ్య 50 అడుగుల వెడల్పుతో కాలువ గతంలో ఉండేది. దీనిని మొత్తం కప్పి చెరువు నుంచి పైభాగం వరకు అమ్మకాలు చేసి సొమ్ము చేసుకున్నాడు. అంతటితో ఆగకుండా ఐటిఐ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాలను కాజేసి అమ్ముకున్నారనే ప్రచారముంది. ఇతరులు ప్రభుత్వ భూముల్లోకి వెళ్తే వారి అనుచరగణం ఆగమేఘాలపై వాలి పోయి నానా యాగిరి చేయడం, వీరికి ఆ స్థలాలు అప్పగించే వరకు విడిచి పెట్టడం లేదని ప్రచారం ఉంది. జంట పట్టణాల్లో వీరికి అనుచరగణం ఎక్కువగా ఉండడంతో వారు చెప్పిందే వేదంగా ఆగడాలు సాగుతున్నాయి. వీరి స్థలాల్లోకి ఎవరైనా వచ్చినా అవసరమైతే అధికార దర్పణాన్ని వినియోగించి వారు పారిపోయే విధంగా వ్యవహరిస్తుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వీరి ఆక్రమణ స్థలాల్లోకి ఎవరై వచ్చినా వారికి నానా ఇబ్బందులు పెడుతు అవసరమైతే అధికార దర్పణాన్ని వినియోగించి వారు పారిపోయే విధంగా వ్యవహరిస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఒక వేళ అధినాయకుని వారిస్తే సోషల్ మీడియాలో రంకెలు వేస్తుండడం తో నాయకత్వం హడలిపోతు ఎందుకొచ్చిన ఈ తంటా అని ఊరుకుంటున్నారట. కేవలం వైకాపా అధికారంలోకి వచ్చిన మూడేళ్ల కాలంలోనే ఈయన కోట్లాదిపైగా ఆక్రమ సంపాదనంటే ఇక రానున్న రెండేళ్లలో ఈయన ఆగడాలకు ఎన్ని చెరువులు, కొండలు కరిగి పోతాయో. ఒకే ఒక్కడుకు వైకాపా నాయకత్వం నిలవరించకపోతే వచ్చే ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించకకోక తప్పదనే హెచ్చరికలు ఆపార్టీ ద్వితీయ శ్రేణి నాయకులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జీవామృతంతోనే అధిక దిగుబడులు సాధ్యం

విశాలాంధ్ర-సోంపేట : సేంద్రీయ వ్యవసాయంతోనే అధిక దిగుబడులతో పాటుగా కాలుష్య రహిత సమాజంను స్థాపించవచ్చునని మాస్టర్ ట్రైనర్ సత్యన్నారాయణ రైతులకు సూచించారు. ఈమేరకు ఆదివారం సోంపేట మండలం బారువ గ్రామంలో కూరగాయల పంటలకు జీవామృతం వాడినట్లయితే అధిక దిగుబడి కాకుండా కూరగాయల పంటలు పురుగులు లేకుండా పండుతాయని బారువ గ్రామంలో లాభాల పుష్పలతకు చెందిన కూరగాయల పొలంలో జీవామృతం తయారు చేసే విధానాన్ని మహిళ రైతులకు నేర్పించారు. జీవామృతం తయారీకి 200 లీటర్ల డ్రమ్ములో 180 లీటర్ల నీరు, రెండు కేజీల బెల్లం, రెండుకేజీల పప్పుల పిండి, 10 లీటర్ల ఆవు మూత్రం, 10 కేజీల ఆవుపేడ, గుప్పెడు పుట్టమన్ను డ్రమ్ములో వేసి మరుగబెట్టి ఆరు రోజుల తర్వాత తయారైన జీవామృతంను పంటలకు ఉపయోగించుకోవచ్చుని జీవామృతం వాడకం వలన పంటల దిగుబడే కాక భూమిలో ఉన్న సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని మండల యాంకర్ కుమారి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పి స్వాతి, మహేష్, జయలక్ష్మి, నీలవేణి లీడ్ ఫార్మర్స్ మహిళ రైతులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర-రణస్థలం : మండల కేంద్రంలో సామాజిక సేవకుల సహాయంతో మై డ్రీమ్ అకాడమీ ,ఏసియఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ కాంప్ ముగింపు కార్యక్రమంను మై డ్రీమ్ సంస్థ ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేవకులు మాట్లాడుతూ విద్యార్థులు వేసవిలో ఆటలుతో మునిగిపోతున్న ఈ కాలంలో ఎంతో ఆసక్తితో శిక్షణా శిభిరం ను వినియోగించు కోవడం సంతోషం అన్నారు. అదేవిధంగా అబాకస్ ద్వారా స్పీడ్ మ్యాథ్స్ చేస్తున్న విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా మై డ్రీమ్ అకాడెమీ డైరెక్టర్ కళా వెంకట రావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కోసం ఆలోచించిన సేవా తత్పురులు బవిరి రమణ మాస్టర్,రాయపు రెడ్డి బుజ్జి, పచ్చిగుళ్ళ సాయి రామ్,తిరుపతి రాజు, దన్నాన సీతారాం,పి.సత్యం నాయుడు, డాక్టర్ రామా రావు, ముక్కు ఆదినారాణ,డి.మహేష్ ,బవిరి ప్రదీప్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసియఫ్ శేఖర్, మేమున్నాం సేవా సంఘం అధ్యక్షులు పచ్చిగుళ్ళ సాయిరాం,టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ రామారావు, దన్నాన మహేష్,వైకాపా నాయకులు భవిరి ప్రదీప్, జేని లక్ష్మణ,అబాకస్ ట్రైనర్ నాజానా శ్రావణి, విద్యార్థుల తల్లదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సేవల ముసుగులో దోపిడీకి యత్నం...!

- హైవే పక్కన అనుమతి ఎలా
- పట్టని బాలల హక్కుల చట్టం-2009
- నేతల మౌనానికి కారణాలేమిటి

విశాలాంధ్ర-ఆముదాలవలస: ప్రభుత్వ నిబంధనల మేరకు ఆరేళ్ల లోపు పిల్లలను పాఠశాలలో చేర్పించాలంటే ఐసిడిఎస్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలి. ఐదేళ్లు నిండని పిల్లలను ప్రైవేట్ విద్యాసంస్థల్లో చేర్పించరాదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఆధ్వ ర్యంలోని నవోదయ పాఠశాలలో ఐదో తరగతిలో చేర్పించేందుకు కామన్ పరీక్ష నిర్వహించేవారు. మానవ హక్కుల కమిషన్ దీనిపై పోరాటం చేయడంతో నామమాత్రపు ఎంట్రీ అవలంబి స్తున్నారు. అటువంటిది సేవలు ముసుగులో కొంతమంది స్వార్థపరులు పల్లెల్లో ఉన్న రైతులను దోచుకునేందుకు వీలుగా ట్వింకిల్ కిడ్స్ పాఠశాల ఏర్పాటు చేసి చిన్నారులకు ప్లే స్కూల్ మాటను లక్షల దోపిడీకి రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. పిఆర్వో, సూపర్వైజర్ యాజమాన్యాలు చెప్పిన విధంగా గ్రామాల్లో తిరిగి తల్లిదండ్రులను వారి వశీకరణ ద్వారా వసుపరుచు కుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికే చుట్టుపట్టు గ్రామాలు, పట్టణ పరిధిలో పిల్లల తల్లిదండ్రులను కలిసి కమిట్మెంట్ తీసుకుంటున్నారు. ఇప్పటివరకు 55 మంది చిన్నారులను చేర్పించేందుకు రంగం సిద్ధమైంది. వీరికి సంబంధించిన ఫీజులు ఇతర వివరాలను 12వ తేదీన యాజమాన్యం నిర్ధారిస్తాదని తల్లిదండ్రులకు సర్ది చెబుతున్నారు. ఇది ఎలా ఉండగా పాఠశాల కోసం వివరిస్తూనే వారి వద్ద కమిట్మెంట్ లెటర్లు తీసుకున్నట్లు తెలిసింది.

హైవే పక్కన అనుమతి ఎలా... కళింగపట్నం నుంచి శ్రీకాకుళం ఆముదాలవలస పాలకొండ పార్వతీపురం తో పాటు ఒడిస్సా లోని జైపూర్ వరకు 80 ఫీట్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ అందించింది. అందులో భాగంగానే శ్రీకాకుళం ఆముదాలవలస పనులు జరుగుతున్నాయి. హైవే పక్కన పాఠశాల ఏర్పాటు చేసి సీబీఎస్ఈ సిలబస్ నేర్పించేందుకు సన్నాహాలు చేస్తున్న యాజమాన్యం వారి భవిష్యత్తును గుర్తుకు రాలేదా అని పలువురు అంటున్నారు. పాఠశాల నిశ్చయాత్మక చర్యలకు మార్గదర్శకాలను కూడా రూపొందించలేదు. అసలు ఈ పాఠశాలకు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేవు.

బాలల హక్కుల చట్టం 2009... 73వ రాజ్యాంగ సవరణ మేరకు ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కుల చట్టం 2009 కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. 86వ రాజ్యాంగ సవరణ చట్టం 2002 ప్రకారం విద్యకు ప్రాథమిక హక్కుగా పరిగణించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇటువంటి తరుణంలో ఈ పాఠ శాలల అవసరం ప్రత్యేకంగా ఉండదు. అమా యకులైన తల్లిదండ్రుల నుంచి ప్లే స్కూలు మాటలు ఉన్నత భావాలు, నడవడిక ప్రాతి పదికన శిక్షణతో కూడిన విద్యను అందిస్తామని తల్లిదండ్రులను నమ్మబలుతున్నట్లు తెలిసింది. తమిళనాడులోని కుంభకోణం ఘటన కళ్ళ ముందు ప్రజలాడుతున్న కనీసం పట్టించుకోవడం లేదు, అలాగే సుప్రీం ధర్మాసనం తీర్పును కూడా ఈ యాజమాన్యం పట్టించుకోలేదు అంటే వీరి రాజకీయ పలుకుబడి ఎంతగా ఉందో తెలుస్తుంది.

నేతలు మౌనానికి కారణాలేమిటి... ఎటువంటి అనుమతులు లేకుండా ఆదాయమే పరమ విధిగా పాఠశాల నిర్వహణకు యాజమాన్యం సంకల్పించింది. ఎటువంటి అనుమతులు లేవని అలాంటప్పుడు ఈ పాఠశాలను ఎలా నడుపుతారని నేతలు ప్రశ్నించేసరికి యాజమాన్యం, అనుమతులకై ఆరాటపడింది. ఇటీవల అనుమతులు వాటిలో భాగంగా టెక్కలి నుంచి శ్రీకాకుళం ఆముదా లవలస ప్రాంత నాయకులను అక్కడ నాయ కులు కలిసినట్లు తెలిసింది. ఇంతలోనే ఏమైందో ఏమో కానీ ఒక్కసారిగా ఆ పాఠశాల ఏర్పాటులో ఉన్న లొసుగులను తెలుసుకునేందుకు కూడా అధికారులను అటువైపు ఎల్లనివ్వకుండా కాపు కాయడం నేతల మౌనానికి కారణంగా కొందరు భావిస్తున్నారు. 80 అడుగుల రోడ్డు నిర్మాణం జరుగుతున్న ఆ పక్కనే ఎటువంటి అను మతులు లేకుండా పాఠశాల నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఏది ఏమైనా జిల్లా ఉన్నతాధికారులు, విద్యాశాఖ కమిషనర్, బాలల హక్కుల కమిషనర్ ఇటువంటి ఇల్లీగల్ పాఠశాలలను నియంత్రించి చిన్నారులను కాపాడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

వందే భారత్ పాదయాత్రకి అసుతోస్ పాండే శ్రీకారం

విశాలాంధ్ర-టెక్కలి : ఉత్తరప్రదేశ్ అయోధ్య నుండి 21 రాష్ట్రాలలో 10,000 కిలోమీటర్లు నడిచి, నేటి యువతలో ఆలోచనలను మొలకెత్తే విధంగా మొక్కలు నాటుతూ, పర్యావరణాన్ని కాపాడాలనే నినాదంతో వందే భారత్ పాదయాత్రకి అసుతోస్ పాండే శ్రీకారం చేపట్టారు. అందులో భాగంగా 5 రాష్ట్రాలు పూర్తిచేసుకుని ఆంధ్రప్రదేశ్ విచ్చేసిన ఆక్సిజన్ ప్రదాతకి భారతీయ జనతా పార్టీ యువ మోర్చా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి బృందం కావలసిన సదుపాయాలను టెక్కలి లో సమకూర్చారు. అతని దృఢమైన సంకల్ప ఆలోచనలతో ముందుకి సాగుతున్న అతని అడుగులో అడుగు వేసి టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అతనకి సన్మానం చేసి వందే భారత్ పాదయాత్ర సమయంలో ఏ రాష్ట్రంలోనైనా ఎటువంటి అవసరం ఉన్న తనకి మేము తోడుగా ఉంటామని ముందుకు ప్రోత్సహించడం జరిగిందని ఆయన అన్నారు. ప్రతి ఒక్క వ్యక్తి మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ వందే భారత్ పాదయాత్రలో ఇప్పటి వరకు 1400 మొక్కలు నాటడం జరిగిందని, 2025 కి యాత్రా పూర్తవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా యువమోర్చా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి, దుపాన రాజ్ కుమార్, హరిచంద్రారావు, ఏబీవీపీ నాయకులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతుల పట్ల వివక్షణ విడనాడాలి

- సాంకేతిక పరిజ్ఞానం పట్ల రైతుకు విజ్ఞానం కల్పించాలి
- సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తేవాలి... కూన రవికుమార్

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలోని సింధు వాడ గ్రామంలో కూన రవికుమార్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఏరువాక సాగారో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రవికుమార్ సాంప్రదాయ వ్యవసాయంలో భాగమైన నాగలితో పొలం దున్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని రైతులతో మాట్లాడి రైతు కష్టాల్ని తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం చెత్త ద్వారా సంపద సృష్టించాలనే ధ్యేయంతో లక్షల ఖర్చు పెట్టి ప్రతి పంచాయతీకి చెత్త నిలువ కేంద్రాలను నిర్మిస్తుంటే. వాటి ద్వారా సేంద్రియ ఎరువులు అందించవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నా..! బాధ్యతను విస్మరించి కేవలం కట్టడాల వరకే పరిమితం చేస్తున్నారని అన్నారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కనీస ధరకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. విజ్ఞాన శాస్త్రం అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతులకు వాటి ప్రయోజనాలు అందడం లేదని, వైసీపీ నాయకుల నిర్లక్ష్యం, అలసత్వం స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఐదు ఎకరాలకి నేల సాంద్రతను పరీక్షించి ఎటువంటి సేంద్రియ ఎరువులు వాడాలి, ఎటువంటి విత్తనాలు నాటాలి ఒంటివాటిపై అవగాహన కల్పించేవారమని, ప్రస్తుత ప్రభుత్వం అటువంటి అభ్యుదయ కార్యక్రమాలకు చర్యలు తీసుకోవడం లేదని తెలియజేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో చిన్న, సన్నకారు రైతుకు భాగస్వామ్యం చేయాలని తద్వారా రైతు మేలైన, నాణ్యమైన పంటను తక్కువ వ్యయంతో పండించుకోగలుగుతారని తెలియజేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో రైతు కష్టాలు ఎదుర్కొంటున్నాడని, ప్రభుత్వ విధానాలు రైతులు అన్యాయం చేస్తున్నాయని, చంద్రన్న వస్తేనే రైతన్నకు న్యాయం జరుగుతుందని రానున్నది రైతన్న రాజ్యం అని రవికుమార్ తెలియజేశారు. తొలుత గ్రామ దేవతకు పూజలు నిర్వహించి, ఈ సంవత్సరం రైతన్న సుభిక్షంగా ఉండాలని, పంటలు మెండుగా పండాలని రవికుమార్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో హిజ్ర మృతి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: మండలం జాతీయ రహదారిలో కన్నేవలస జంక్షన్ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాధంలో మందస మండలం పద్మపురం గ్రామానికి చెందిన సవర అరుణ్‌కుమార్ అనే హిజ్ర గుర్తు తెలియని వాహనం ఢీ కొని మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ ఎస్‌కె. మహ్మద్అలీ తెలిపారు. అయితే మరో హిజ్ర బోనేల వంశీకృష్ణ ఇచ్చిన పిర్యాదు మేరకు అరుణకుమార్ నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ్లే రోడ్డులో రోడ్డు దాటే క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొందని అరుణకుమార్ అక్కడకక్కడే మృతి చెందినట్లు ఆదివారం నాడు పిర్యాదు చేశారు. ఈ మేరకు మృతదేహం పోస్టుమార్థం కోసం స్థానిక అసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

విశాలాంధ్ర-ఇచ్చాపురం : అత్యంత హృదయ విదారకరమైన ఒడిస్సా రైలు ప్రమాదం పట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఒడిశా రాష్ట్రంలో బాలేస్వర్ సమీపంలో జరిగిన దుర్ఘటన తమను కలచివేసిందని అన్నారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ టిడిపి బి.సి. రెడ్డిక సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్డిక సాధికారిక సమితి రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ తిప్పన బాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు బోర ప్రసాద్, బచ్చు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కదిలొచ్చిన యువత...

- మానవత్వం చాటుకున్న రెల్లివీధివాసులు
- రెడ్‌క్రాస్‌లో 20 మంది యువత రక్తదానం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఒడిశా రాష్ట్రంలో రైలు ప్రమాద ఘటనలో గాయాలైన వారి కోసం హయాతినగరం రెల్లివీధి, పెద్దరెల్లి వీధి యూత్ ముందుకు వచ్చి రక్తదానం చేసి వారి మానవత్వాన్ని చాటుకున్నారు. రక్త సంబంధం కాకపోయినా కష్టంలో ఉన్న వారి కోసం రక్తాన్ని దానం చేసి పలువురితో ప్రశంసలు అందుకున్నారు. అనుకోని ప్రమాదంలో క్షతగాత్రులుగా మిగిలిన వారికి సకాలంలో రక్తాన్ని అందించేందుకు వారంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేయడం అభినందించదగ్గ విషయమని రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. జగన్‌మోహన్ రావు అన్నారు. ఒడిశా రాష్ట్రంలో బాలాసుర్ జిల్లా కు సమీపంలో జరిగిన హౌరా - చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (12841) , బెంగళూర్ - హౌరా ఎక్స్‌ప్రెస్ (12864) రైలు ప్రమాద ఘటనలో వందలాదిమంది గాయపడ్డారు. వారికి అత్యవసర వైద్యనిమిత్తం రక్తం అవసరమని, జిల్లాలో యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జగన్‌మోహనరావు పిలుపునిచ్చారు. వెంటనే హయాతినగరం రెల్లివీధి, పెద్దరెల్లి వీధులకు చెందిన 30 మంది యువకులు స్వచ్ఛందంగా రెడ్‌క్రాస్‌కు వచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెల్లివీధి పెద్దలు జలగడుగుల శ్రీరాములు, 23వ డివిజన్ టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ కళ్యాణి వెంకటరావు, అరుగుల గణేష్ ఆధ్వర్యంలో కళ్యాణి కూర్మారావు, కళ్యాణి జ్యోతి ప్రసాద్, ఆకుల సురేష్‌కుమార్‌ల సమక్షంలో పెద్ద ఎత్తున యువత రక్తదానం చేయడంపై వారు అభినందనలు తెలియజేశారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు కే సత్యనారాయణ, పి చైతన్య కుమార్, బి చిన్మయ్ రావు, రెడ్‌క్రాస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు సీపీఐ సంతాపం

- మృతులకు కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్ గ్రేసియా అందించాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి



విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఒడిస్సా లో జరిగిన రైలు ప్రమాదం లో వందల సంఖ్యలో మృతి చెందిన సంఘటన దిగ్భ్రాంతి కరమని వారి మృతి పట్ల సీపీఐ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకే సారి రెండు ప్రయాణికుల రైళ్లు ప్రమాదం జరగటం తో భారీ సంఖ్యలో ప్రాణనష్టం జరగటం, మరెందరో క్షత గాత్రులు ఉండటం బాధాకరం అన్నారు. ఈ ప్రమాదం కి బాధ్యత వహించి రైల్వే మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన వారి కుటుంబానికి వెంటనే రూ. 50 లక్షలు ఎక్స్ గ్రేషియా అందించి కుటుంబం సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదం లో గాయ పడిన వారికి మెరుగైన వైద్య కల్పించి గాయ పడిన వారికి రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా రైల్వే పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మృతి చెందిన వారికి సంతాపాన్ని తెలుపుతూ వారి కుటుంబాలకు తీవ్ర సానుభూతిని ఆయన తెలిపారు.

పిడుగుపాటుకు మహిళా మృతి

విశాలాంధ్ర-బూర్జ: బూర్జ మండలం లాభం గ్రామంకు చెందిన నక్క పద్మావతి వయసు (56) సంవత్సరాలు. పశువులు మేతలకై ఆవుని పొలంకి తోలుకొని వెళ్లి తిరిగి వస్తున్నప్పుడు పిడుగుపాటుకు గురై పద్మావతి మరియు ఆవు అక్కడకక్కడే మృతి చెందాయి. గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదుచేసినట్లు తెలియజేశారు. స్థానిక ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసుకున్నారని గ్రామస్తులు తెలియజేశారు.

వేసవిపట్ల జాగ్రత్తలు వహించాలి : కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్

విశాలాంధ్ర-పలాస: వేసవిపట్ల చిరు వ్యాపారులు, ప్రజలు జాగ్రత్తలు వహించాలని పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వ కౌన్సిలర్, శ్రీమంకినమ్మ పండ్ల తోపుడు బండ్లు వర్తక సంఘం గౌరవ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం ఎండకాలం ఎండల దృష్ట్యా లక్షా 25వేల రూపాయలు విలువ చేసిన గొడుగులను 120 మంది తోపుడు బండ్లు వర్తకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి, వర్షాకాలంలో తోపుడు బండ్లు వ్యాపారులకు వ్యాపారం చేసుకోవడం కోసం ఈ గొడుగులు చాలా ఉపయోగ పడతాయని అన్నారు. కార్యక్రమంలో కొత్తకోట రమణ, సకలాబత్తుల తవుడు, బమ్మిడి చూడామణి, ఇంటివెనుక వీరాస్వామిలు పాల్గొన్నారు.

ఘనంగా గాన గంధర్వుడు జయంతి

విశాలాంధ్ర-సోంపేట : గాన గంధర్వుడు ఎస్పి బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాలు చిత్రపటానికి మేజర్‌పంచాయతీ ఉపసర్పంచ్ మల్లా వెంకటరమణ, సీనియర్ కళాకారులు దేవేంద్రనాథ్ పండా, మద్దిల హేమసుందర్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. తెలుగు సాహిత్య రచయిత సాహుకారి ధనుంజయ మాట్లాడుతూ అన్ని భాషలో పాటలు పాడుతూ తెలుగు ఖ్యాతిని చాటి చెప్పిన మహనీయులని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు లోపింటి కామేశ్వరరావు, ముప్పన ఈశ్వరరావు, గ్రామస్తులు బి.గిరి, ఎం.తేజేశ్వరరావు, మద్దు వెంకి పాల్గొన్నారు. అనంతరం ఎస్పి బాలు ఆలపించిన పాటలు కళాకారులు పాడారు.

ఆతిసార వ్యాధి నివారణ పక్షోత్సవాలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ మీనాక్షి

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఐదు సంవత్సరాలలోపు చిన్నారుల్లో ఆతిసార వ్యాధి నివారణ నిమిత్తం జూన్ 5 నుండి జూన్ 17 వరకు ఆతిసార వ్యాధి నివారణ పక్షోత్సవాలు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. మీనాక్షి అన్నారు. ఇప్పటికే జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు, అంగన్వాడీ స్కూళ్లకు మరియు వైఎస్సార్ విలేజ్ క్లినిక్ లకు ఓఆర్ఎస్, జింక్ మాత్రలు సరఫరా చేయడం జరిగిందన్నారు. ఈ పక్షోత్సవాల్లో తల్లులకు, కుటుంబ సభ్యులకు ఆతిసార వ్యాధి మీద అవగాహన కల్పించడం, చికిత్స విధానాలు పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. 5సం. వయస్సు లోపు పిల్లల్లో ఆతిసార లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆశా ను కానీ,ఏఎన్ఎం ను కానీ సంప్రదించి వారు సూచించిన విధంగా ఓఆర్ఎస్, జింక్ లను ఇవ్వాలని జిల్లా ఇమ్యూ నైజేషన్ అధికారి డాక్టర్ %=ూ% కుమార్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ బి. మీనాక్షి వారి సూచనల ప్రకారం జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలను సిద్ధం చేసినట్టు తెలిపారు. ప్రతి పీహెచ్‌సీలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్ లను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలియచేశారు. ఆతిసార వ్యాధి వల్ల జరిగే మరణాలను గణనీయం గా తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐడీసీఎఫ్ కార్యక్రమం ద్వారా కృషి చేస్తున్నాయని అయన తెలిపారు. కాబట్టి ఆతిసార లక్షణాలు ఉన్న పిల్లలను తక్షణం ఈ కార్యక్రమం ద్వారా చికిత్స చేయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హర్బన్ మెడికల్ అధికారి డా. జంపు కృష్ణ మోహన్, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి చేయూత

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని చిన్న ఎర్ర గోవిందపుట్టుగకు చెందిన గోవింద భాగ్యం అనే నిరుపేద విద్యార్థినికి శ్రీ చింతామణి అమ్మవారి ట్రస్ట్(హైదరాబాద్) తరపున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఒంగోలు లో కిమ్స్ నర్సింగ్‌లో నర్సు కోర్స్ చదువుతున్న చిన్న ఎర్రగోవింద పుట్టుగకు చెందిన గోవింద భాగ్యం అనే నిరుపేద విద్యార్థినికి శ్రీ చింతామణి అమ్మవారి ట్రస్ట్(హైదరాబాద్) కవిటి వారి ఆర్థిక సహాయంతో ఫీజులు నిమిత్తం 20 వేలు రూపాయలు శ్రీచింతామణి అమ్మవారి ఆలయ కమిటీ సమక్షంలో అందజేశారు. ఈ కార్య క్రమంలో స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మండల కోఆప్షన్ సభ్యులు పాండవ చంద్ర శేఖర్, ఆరంగి మధు, పోల్లాయి ఉమామహేశ్వర రావు, జన్ని లోకనాథం, మోహనరావు, పోల్లాయి సింహ చలం,బావన రవి, జ్ఞానసంద, టీ వి.రమణ, పాల్లాయి అప్పారావు, ట్రస్ట్ సభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థిని తల్లి తండ్రులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని వివిధ పాఠశాల నుండి ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్)కు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ ధనుంజయ మజ్జి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జిహెచ్ఎస్ కవిటి నుండి బైరెడ్ల పవిత్ర, జడ్పీహెచ్ఎస్ రాజపురం నుండి పత్రి వినయ్, జడ్పీహెచ్ఎస్ బోరివంక నుండి నౌపడ ఉదయ్, జడ్పీహెచ్ఎస్ బోరివంక నుండి, ఇరోతు గణేష్‌రావు, జిహెచ్ఎస్ కవిటి నుండి నెయ్యల హాసిని, జడ్పీహెచ్ఎస్ బోరివంక నుండి లోల్ల సారిక, జడ్పీహెచ్ఎస్ ముత్యాలపేట, జల్లు అభిజిత్, ఏపీ మోడల్ స్కూల్ రాజపురం,మత్రి ప్రమీల, ఏపీ మోడల్ స్కూల్, పొన్నగంటి జయలక్ష్మి, జిహెచ్ఎస్ కవిటి, బొమ్మాలి మణికంఠ, జడ్పీహెచ్ఎస్ రాజపురం, పత్రి మధు, జిహెచ్ఎస్ కవిటి, గుడే మహాలక్ష్మి, జడ్పీహెచ్ఎస్ బోరివంక నుండి మద్దిల సాయిచరణ్‌లు ఎంపిక అయినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి 12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు. స్కాలర్షిప్ కు ఎంపికైన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జితో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అభినందించారు.

మండల అభివృద్ధి అధికారిగా అప్పారావు

విశాలాంధ్ర-జలుమూరు : మండల అభివృద్ధి అధికారిగా ఎటి అప్పారావు బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మండల పర్యవేక్షకుడు దామోదర్ అధ్వర్యంలో మండల సిబ్బంది స్థానిక వినాలను సిబ్బంది అభినందించారు. ఈయన పార్వతీ పురం మండల పరివేక్షుడిగా పనిచేస్తూ ఇక్కడ ఎండీవోగా నియమించబడ్డారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన జీవీ రవికుమార్ సంతకవిటి ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. తాను ఇక్కడ పనిచేసిన ఎనిమిది నెలలు సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బాలాసూర్ మృతులకు ఘన నివాళులు



విశాలాంధ్ర-కవిటి : ఒరిస్సా రాష్ట్రం బాలాసూర్‌లో రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి కవిటి గ్రామంలోని ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మృతులకు ఘనంగా నివాళు లర్పించారు. కవిటి మూడు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారం చేపట్టి మృతులకు ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షులు పాండవ చంద్రశేఖర్,స్థానిక వైద్యులు ధన్వంతరి రౌల్లో,ఆరంగి రాజు,బల్లెడ రమేష్,మొత్రి గోపి, బెందాళం జోగి శ్రీను,బెందాళం వకిలు రాంబాబు,యువజన సంఘ సభ్యులు,అధిక సంఖ్యలో యువత తదితరులు పాల్గొన్నారు.